బిసి వసతి గృహాల్లోని సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలోని బిసి వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించాలని ఎబిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, నాగరాజు కోరారు. బుధవారం జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి భరత్ కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టళ్లలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించడం లేదన్నారు. సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు లేవని, కాస్మొటిక్ ఛార్జీలు ఏడు నెలలుగా అందించడం లేదన్నారు. అద్దె భవనాలలో ఉన్న బిసి హాస్టల్స్ శాశ్వత భవనాలు నిర్మించాలని, బ్రహ్మంగారిమఠం మండలంలోని పలుకూరాళ్లపల్లెలో, కొన్నిపాడు బిసి హాస్టల్ మూతపడ్డాయని తెలిపారు. అటువంటి వాటిని వెంటనే తెరచి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకుని వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. మంచినీటి సదుపాయం లేదన్నారు.

నేడే ఆశల బడ్జెట్

- 'పయ్యావుల'పైనే భరోసా
- 'ఉక్కు' పరిశ్రమకు కదలికొచ్చేనా?
- రూ.1,300 కోట్లతో ఇరిగేషన్ ప్రతిపాదనలు
- రాయలసీమ మిటిగేషన్ ప్రాజెక్టుకు మోక్షమెప్పుడో!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఫుల్ ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్-2024-25 సమగ్రబడ్జెట్ సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి పయ్యావుల కేశవ్ అక్టోబర్ నాటికి సంబంధించిన స్వల్ప కాలిక బడ్జెట్‌ను గురువారం ప్రవేశపెట్టనున్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు చేయనున్న కేటాయింపులపై అందరి దృష్టి నిలిచింది. రెండేళ్ల కిందట నుంచి జిల్లాలో పారిశ్రామికానికి మౌలిక వసతుల కల్పనలో కదలిక వచ్చినప్పటికీ పరిశ్రమల ఏర్పాటు నానాటికీ అసాధ్యం వుతోంది. జిల్లా ఇరిగేషన్ ఇంజినీరింగ్ యంత్రాంగం ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు సుమారు రూ.1,330 కోట్లు, పెండింగ్ బిల్లులు రూ. 830 కోట్లు చెల్లించాలని కోరుతూ ప్రతిపాదనలు అందజేసింది. రాయలసీమ మిటిగేషన్ ప్రాజెక్టు, జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు, కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తిపోతలు, రాజోలి, జొలదరాశి, యురేనియం బాధిత గ్రామాలకు తాగునీటి సరఫరా ప్రాజెక్టులకు కేటా యింపులు చేయాల్సి ఉంది. జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచార పర్య టనల సందర్భంగా సకాలంలో ప్రాజెక్టుల పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామనే హామీ నేపథ్యంలో గతంలో జమ్మలమడుగు నియోజకవర్గం కంబాలదిన్నె వద్ద శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. అనంతరం 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసిపి ఉక్కు పరిశ్రమను మూడేళ్లలో ఏర్పాటు చేస్తామని హామీని నెరవేర్చని సంగతి తెలిసిందే. జలవనరుల పరిస్థితుల నేపథ్యంలో కూటమి అభ్యర్థులను ప్రజానీకం పట్టం కట్టింది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు రివర్స్ టెండరింగ్‌తో నిలిచిపోవడం తెలిసిందే. అనం తరం టెండర్లు నిర్వహించడం మినహా మిగిలిన ప్యాకేజీ-1, ప్యాకేజీ-2 ప్యాకేజీ-3 పనులకు ప్యాకేజీ-4, ప్యాకేజీ-5, ప్యాకేజీ-6, ప్యాకేజీ-7 పనుల్లో ఎటు వంటి పురోగతి లేకుండా పోయింది. దీనికితోడు రూ.1357 కోట్లతో రాజోలి, రూ. 1312 కోట్లతో జొలదరాశి, రూ.564 కోట్లతో కుందూ-పెన్నా ఎత్తిపోతల, రూ. 5,000 కోట్లతో కాలేటివాగు ఎత్తిపోతల పథకం భూసేకరణ, అడ్డంకుల కార ణంగా ముందుకు సాగడం లేదు. ఇదేతరహాలో పులివెందుల నియోజకవర్గ పరి ధిలోని యురేనియం బాధిత గ్రామాలకు తాగునీటి పైప్‌లైన్ పనులు సాకా రానికి నోచుకోలేదు. జిల్లావ్యాప్తంగా గండికోట, సోమశిల, పైడిపాలెం నిర్వా సితుల సంగతిని పట్టించుకోవడం లేదు. గండికోట నిర్వాసితులకు పెంచిన పరి హారం ఎప్పటికి అందుతుందో తెలియడం లేదు. తెలుగుగంగ, చిత్రావతి, సర్వరాయసాగర్ రిజర్వాయర్ల లీకేజీ పనులు దశాబ్దాల తరబడి నిరీక్షి స్తుండడం తెలిసిందే. ఇదిలాఉండగా తెలుగు గంగ ఇంజనీరింగ్ యంత్రాంగం తాజాగా రూ.125 కోట్ల మేరకు ప్రతిపాదనలు పంపించింది. రాయలసీమ మిటి గేషన్ ప్రాజెక్టు, జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 ప్రతిపాదనలకు సంబంధించిన కేటాయి ంపులు ఏమేరకు ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.

అన్ని కోణాల్లో విచారణ

విఆర్‌కు సిఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్ - ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిసోడియా, అగ్నిమాపక శాఖ డైరెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంపై అన్ని కోణాల్లో విచారణ జరుగుతోంది. విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. మూడు రోజులుగా రెవెన్యూ, పోలీసు, సిఐడి అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసులో కుట్రధారులుగా అనుమానిస్తున్న పలువురు రెవెన్యూ అధికారులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మదనపల్లె ఆర్‌డిఒగా పనిచేసిన మురళి, ప్రస్తుత ఆర్‌డిఒ హరిప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌ను పోలీసులు సబ్ కలెక్టర్ కార్యాలయంలోనే వరుసగా మూడోరోజు కూడా విచారణ చేస్తున్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, ఎస్‌పి, సిఐడి అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సిఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఈ ఘటనలో కుట్ర కోణాన్ని వెలికితీయడానికి అధికార బృందం చర్యలు చేపట్టింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రధాన అనుచరుడు మాధవరెడ్డి ఈ ఘటనలో కీలక పాత్రధారిగా భావిస్తూ ఆయన కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

సచివాలయాల్లో స్పెషల్ సిఎస్ తనిఖీ: ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్.పి.సిసోడియా, కలెక్టర్ చామకూరి శ్రీధర్, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ బుధవారం మదనపల్లి సబ్ డివిజన్‌కు సంబంధించి సచివాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మదనపల్లి మండలం వెంకటప్ప కోట గ్రామంలో మ్యాపింగ్ చూసి సర్వే రాళ్లను పరిశీలించారు. అనంతరం మదనపల్లి మండలం వెంకటప్పకోట, చిన్నతిప్పసముద్రం ఒకటిలో గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ ఉన్నటువంటి ఎఫ్ఎల్ఆర్ రిజిస్టర్, అడంగల్, ఆర్ఒఆర్ 1(బి), 10(1) డిజిటల్ సర్వీస్ లకు సంబంధించిన రికార్డులను ఎలా నమోదు చేస్తున్నారని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎలా జరుగుతొందని ఇన్‌ఛార్జి సబ్ రిజిస్టర్‌ను రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మదనపల్లి తహశీల్దార్ రమాదేవి, సర్వేయర్లు, విఆర్‌ఒలు, డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖ డైరెక్టర్ పరిశీలన : బుధవారం ఉదయం అగ్నిమాపకశాఖ డైరెక్టర్ పి.వి.వెంకటరమణ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగితే ఎవరు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు, సిబ్బంది వచ్చినప్పుడు కార్యాలయంలో ఎవరెవరు ఉన్నారనే దానిపై ఆరా తీశారు. ఆయనతో పాటు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అనిల్‌కుమార్, మదనపల్లె అధికారి శివప్ప వచ్చారు. ఘటన జరిగిన తీరు, వివిధ అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

విచారణను వేగవంతం చేస్తున్నాం : ఎస్‌పి : మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఫైల్స్ దగ్ధం చేసిన ఘటనలో విచారణను వేగవంతం చేశామని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు కానిస్టేబుళ్లు హరిప్రసాద్, భాస్కర్‌లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేశామని తెలిపారు. రాత్రి బీట్ సెక్షన్‌లో ఉన్న ఈ ఇద్దరు కానిస్టేబుళ్లు సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంటలు చెలరేగితే ఆ ఘటనను ఉన్నత స్థాయి అధికారులకు తీసుకెళ్లడంలో నిర్లక్ష్యం వహించడంతో చర్యలు తీసుకున్నామన్నారు. సిఐ వల్లిబసు జరిగిన సంఘటనను వెంటనే డిఎస్‌పి, ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లకపోవడంతో అతన్ని విఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. సంఘటన జరిగిన రోజునుంచే పరిసరాలు డిస్టర్బ్ కాకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మూడవ వ్యక్తి లోనికి రాకుండా ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. సంఘటనతో సంబంధం ఉండే అవకాశం ఉందన్న అనుమానం కలిగిన 30 నుంచి 35 మందిని ఇప్పటికే విచారించామని, విచారణ త్వరలోనే తుది దశకు చేరుకుంటుందని తెలిపారు. కాలుతున్న 700 ఫైల్స్‌ను ఆ శాఖ అధికారులకు అందజేశామని, ఆ ఫైల్స్ యొక్క తీరు, వాటి ప్రభావాన్ని అంచనా వేసిన తరువాతనే ఏ స్థాయిలో నేర తీవ్రత ఉందో నిర్ధారణకు రావచ్చన్నారు. విచారణలో ప్రతి చిన్న అంశాన్ని వదలకుండా లోతుగా, సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని త్వరలోనే ఈ కేసును పూర్తి చేస్తామని తెలిపారు.

అందరి సహకారంతో జిల్లా అభివృద్ధి : జెసి

ప్రజాశక్తి-కడప

ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారంతో జిల్లా ప్రజల అభిమానంతో జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు నడిపించేందుకు కృషి చేస్తామని వైఎస్ఆర్ జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌కు చేరుకున్న ఆమె జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందేలా కృషి చేస్తానని తెలిపారు. తొలుత తాను 2020 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారినని, ముందు తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా ఆరు నెలలు పనిచేశానని, అంతకుముందు తొలుత విశాఖపట్నం జిల్లాలో శిక్షణ పొంది విజయవాడ సబ్ డివిజన్‌లో సబ్ కలెక్టర్‌గా దాదాపు 14 నెలలు పనిచేశానని చెప్పారు. ప్రస్తుతం జాయింట్ కలెక్టర్‌గా కడప జిల్లాకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతకు మునుపు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శివశంకర్ లోతేటిని మర్యాదపూర్వకంగా కలసి పూలమొక్కను అందించారు. అనంతరం పలువురు జిల్లా అధికారులు, ప్రముఖులు, తదితరులు పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికి జాయింట్ కలెక్టర్‌కు తమ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ గంగాధర్ గౌడ్, పులివెందుల, బద్వేలు డివిజన్ల ఆర్‌డిఒలు వెంకటేష్, చంద్రమోహన్, ఐఅండ్‌పిఆర్ ఎడి పి.వేణుగోపాల్‌రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్ కుమార్, పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జెసిగా బాధ్యతలు స్వీకరిస్తున్న అదితి సింగ్

చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తాం : కలెక్టర్

ప్రజాశక్తి-కడప

జిల్లాలో చేనేత వృత్తికి పూర్వవైభవం తీసుకురావడంతో పాటు ప్రపంచ మార్కెట్‌లో మన చేనేత ఉత్పత్తులకు మంచి గుర్తింపును తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా చేనేత, జౌళి సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు నాగరాజరావు అధ్యక్షతన జిల్లాలోని మైలవరం మండలంలో టెక్స్ టైల్ పార్కు అభివృద్ధి పనుల పురోగతిపై కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కుటుంబాల ఆర్థిక అభివృద్ధి కోసం చేనేత, జౌళి శాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందన్నారు. మగ్గాలనే నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న జిల్లా చేనేత వృత్తిదారులను ఆదుకునేందుకు, చేనేత వృత్తిని ప్రోత్సహించడానికి దాదాపు 3000 మందికి ఉపాధి అవకాశాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని మైలవరం మండల పరిధిలో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తోందన్నారు. 2005-06 ఆర్థిక సంవత్సరంలో 68.18 ఎకరాల్లో 118 ప్లాట్లతో ఈ పార్కును అభివృద్ధి చేసేందుకు నాంది పలకడం జరిగిందన్నారు. ఇందుకు గాను కేంద్ర ప్రభుత్వం రూ.5.99 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.39 కోట్లు కలిపి మొత్తం రూ.7.38 కోట్లను కేటాయించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు రూ.3.85 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేశామన్నారు. ల్యాండ్ డెవెలప్మెంట్, రోడ్లు, భవనాల నిర్మాణం, క్లినిక్, క్యాంటీన్, పవర్, వాటర్ సప్లై తదితర అభివృద్ధి మౌలిక సదుపాయాల పనులకు రూ.2.78 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఈ టెక్స్ టైల్ పార్కులో యూనిట్ల స్థాపన కోసం ఇప్పటికే 47 మంది దరఖాస్తు చేసుకొని ప్లాట్లు సొంతం చేసుకోగా ఇంకా 75 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే అన్ని రకాల మౌలిక సదుపాయాలను సమకూర్చడం జరిగిందన్నారు. వారి ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించనుందన్నారు. కార్యక్రమంలో ఎపిఐఐసి జడ్ఎం, ఎపిఎస్‌పిడిసిఎల్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్, సంబంధిత శాఖల అధికారులు, జిల్లా చేనేత జౌలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి : డిపిఒ

ప్రజాశక్తి-వల్లూరు

మండల కేంద్రంలోని అన్ని పంచాయతీల్లోని పంచాయతీ కార్యదర్శులు పరిశుభ్రతపై శ్రద్ధ వహించినప్పుడు గ్రామాల్లో అభివృద్ధి కనబడుతుందని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యో పనులు పరిశుభ్రమైన తాగునీరు అందించుట గ్రామాల్లో ఉన్న ఉపరితల జలాశయాలు భూతల జలాశయాలు రోజువారి పారిశుధ్య పనులను నిర్వహిస్తూ రిజిస్టర్ నిర్వహించాలన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయభాస్కర్, విస్తరణ అధికారి ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ అధికారి మోజీబ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి-కడప

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజన పథకంను వెంటనే టిడిపి ప్రభుత్వం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు డిమాండ్. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకొనే విద్యార్థులు చాలా మంది కూడా పేద బడుగు బలహీన వర్గాలకు చెందినవారు ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళశాలల్లో భోజన పథకంను మళ్లీ అమలు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలికవసతులను కల్పించాలన్నారు. జూనియర్ కళాశాలల భవనాలు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. తల్లికి వందనం పథకంను విద్యార్థులకు ఎలాంటి షరతులు లేకుండా ఎంత మంది విద్యార్థులు ఉంటారో అంత మందికి కచ్చితంగా అమలు పరచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అరుణ్ కుమార్, చైతన్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టాలి

ప్రజాశక్తి-కడప: జిల్లాలో జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ల చోరీని అరికట్టాలని కోరుతూ బుధవారం జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ ఎఎస్‌పి లోసారి సుధాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. చోరులు ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి వాటిలోని కాపరువైరును చోరీ చేస్తున్నారని తెలియజేశారు. ఈ చోరీల వలన సాగు చేస్తున్న పంటలకు, సంస్థకు నష్టం జరుగుతుందని వీటిని అరికట్టాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు.

మినుము పంటను పరిశీలించిన ఎఒ

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలో సాగు చేసిన మినుము పంటను వ్యవసాయాధికారి షరీఫ్ బుధవారం తనిఖీ చేశారు. మినుము పంట 40-60 రోజుల దశలో ఉన్నప్పుడు పల్లాకు తెగులు, లద్దె పురుగులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ తెగులు రాకుండా నివారణ చేసేందుకు ఎసిటమాప్రిడ్ 0.5 మిల్లీమీటర్లు నీటిని పిచికారి చేసుకోవాలన్నారు. లద్దె పురుగు నివారణకు క్లోరెంట్ల నెలిప్రోల్, 0.3 మిల్లీలీటర్ల నీటిని కలిపి పిచికారి చేయాలని తెలిపారు. అలా చేయడం వలన తెగులు నశించి పంట దిగుబడి ఎక్కువగా వస్తుందని చెప్పారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి-కలసపాడు: మండలంలోని ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం మండల అభివృద్ధి అధికారి కోటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాల పరిసరాల చుట్టూ శుభ్రంగా ఉండాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పాఠశాలలో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం వస్తున్న సీజన్ వ్యాధులలో భాగంగా విద్యార్థులు కలుషితమైన నీటిని తాగకుండా, పాఠశాలలో స్వచ్ఛమైన నీటిని అందించాలని కోరారు. విద్యార్థులు భుజించే భోజనం వేడిగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కమాల్‌బాషా పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-కాశినాయన

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి సిడిపిఒ లక్ష్మీదేవి, ఎంఇఒ నిర్మల అన్నారు. బుధవారం మండల కేంద్రమైన నర్సాపురంలోని ఉపాధి హామీ సభా భవనంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు ప్రభుత్వం పోష్ చట్టాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రయివేటు, ప్రభుత్వ సంస్థలలో పనిచేసే మహిళలు అంతర్గత ఫిర్యాదు చేయడంతోనే లైంగిక వేధింపులకు స్వస్తి చెప్పవచ్చని పేర్కొన్నారు. పోస్ట్ చట్టాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనిపై ఒక కమిటీ కూడా ఉందని ఇందులో 50 శాతం మహిళలే ఈ కమిటీలో ఉండాలన్నారు. ఏ ప్రభుత్వ కార్యంలోనైనా పది మంది సిబ్బంది కన్నా తక్కువ ఉన్న కార్యాలయంలో ఇలాంటి సమస్యలు వస్తే తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మధుసూదన్, ఇఒపిఆర్‌డి రామకృష్ణారెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

తేక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని సెయింట్ ఆంటోనీస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి తేక్వాండో పోటీలలో పాల్గొని తమదైన శైలిలో విజయాన్ని సాధించారు. మూడు రజితం, మూడు కాంస్య పథకాలను కైవసం చేసుకున్నామని పాఠశాల కరస్పాండెంట్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. నేటి సమాజంలో విద్యార్థులు ఒక చదువులోనే కాకుండా అన్ని రంగాలలోనూ ముందుకు రావాలని తెలిపారు. అనుకున్నది సాధించాలంటే ఏకాగ్రత, క్రమశిక్షణ, పట్టుదల కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం : విసి

జాబ్‌మేళాను పర్యవేక్షిస్తున్న వైవీయూ విసి కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయంలో జాబ్‌మేళాను యోగి వేమన యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, ఆచార్య తప్పెట రామ ప్రసా దరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ విశ్వవిద్యా లయం సమాజ ఉపయోగకరంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయానికి మరిన్ని కంపెనీల ఆహ్వానించి ఇక్కడ చదువుతున్న విద్యార్థులతోపాటు బయట వారికి కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యతను తీసుకున్నామని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన వారు అంకితభావంతో పనిచేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి వచ్చిన కంపెనీలు విశ్వసినీయమైనవని అందులో ఉద్యోగాలు పొందితే దీర్ఘకాలం కొనసాగ వచ్చన్నారు. ప్లేస్మెంట్ సెల్ సంచాలకులు ఆచార్య ఎల్.వి.రెడ్డి మాట్లాడుతూ నిరంతరం విద్యార్థుల ప్రయోజనకరంగా ప్లేస్మంట్ సెల్ పనిచేస్తుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ ఎంపికలను నిర్వహిస్తామని తెలిపారు. టిసిఎల్ డైరెక్టర్ శివకుమార్, అపోలో ఫార్మసీ కంపెనీ హెచ్ఆర్ శశికాంత్, కుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 32 మందిని యువతను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. తమ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారికి వేతనంతో పాటు మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కంపెనీల గురించి వివరించారు.

27న ఐటిఐలో కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఐటిఐగా ప్రవేశానికి రెండవ దఫా కౌన్సెలింగ్ ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ ఎడి రత్నరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్‌తో విద్యార్థులు హాజరుకావాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో కూడా తరగతులు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రాష్ట్ర తరగతులను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఈ నెల 27, 28, 29, 30వ తేదీన నంద్యాలలో నిర్వహించే డివైఎఫ్ఐ రాష్ట్ర స్థాయి నాయకత్వ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, విరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కార్యాలయంలో రాష్ట్ర తరగతులకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్ కార్యాచరణ అజెండాగా తీసుకుని ముందుకు సాగుతామన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. జిల్లాలోని యువత రాష్ట్ర క్లాసులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ విజయ్, కో-కన్వీనర్ పెద్దన్న, సభ్యులు భాస్కర్ రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** రాష్ట్ర స్థాయి నాయకత్వ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్ ఉపాధ్యక్షులు సుబహాన్ తెలిపారు. స్థానిక ఐటిఐలో రాష్ట్ర క్లాసులు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు సూరి ఇసాక్ దస్తగిరి సురేంద్ర రమేష్ పాల్గొన్నారు.

వన్ టౌన్ ఎస్ఐని సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : దళిత విద్యార్థిపై దాడి చేసిన కడప వన్ టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం అంబేద్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళితులపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డిపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని తెలిపారు. ఎస్ఐపై జిల్లా ఎస్‌పితో పాటు సిఎం చంద్రబాబు నాయుడు, హోం మినిస్టర్ అనితను కలిసి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

అంబేద్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

కష్టాల్లో కడప, విశాఖపట్నం జట్లు

తలపడుతున్న కడప, వెస్ట్ గోదావరి జట్లు

ప్రజాశక్తి-కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎసిఎ అండర్-19 గ్రూప్-బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో బుధవారం ఎసిఎ స్టేడియంలో ప్రారంభమైన మ్యాచ్‌లో కడప, వెస్ట్‌గోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 79.3 ఓవర్లలో 215 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రణధీర్ రెడ్డి 49, గురు చరణ్ 46 పరుగులు చేశారు. వెస్ట్ గోదావరి జట్టులోని చరణ్ సాయి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్‌గోదావరి జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 19.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది.

సంతోష్ సెంచరీ... భారీ స్కోరు దిశగా శ్రీకాకుళం

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో ఎన్.సంతోష్ సెంచరీ చేయడంతో శ్రీకాకుళం జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 29.3 ఓవర్లలో 119 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఎస్.ఎస్.హమీద్ 42 పరుగులు చేశాడు. శ్రీకాకుళం జట్టులోని పూర్ణచంద్ర అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. జున్నారావు 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు మొదటి రోజు ఆట ముగిసిన సమయానికి 59.0 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 262 పరుగుల భారీ స్కోరు దిశగా పయనిస్తుంది. ఆ జట్టులోని ఎన్.సుశాంత్ బ్యాటింగ్లో అద్భుతంగా రాణిస్తున్నాడు. 180 బంతులను ఎదుర్కొని 26 బౌండరీల సహాయంతో 127 పరుగులు చేసి (నాటౌట్)గా నిలిచాడు. పి.ఎస్.విగ్నేష్ 58 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని ఎస్.ఎస్.హమీద్ వికెట్లు తీసుకున్నాడు.

మొదటి ఇన్నింగ్స్‌లో 286 పరుగులు చేసిన చిత్తూరు

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నం, చిత్తూరు జట్లు తలపడుతున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 88.1 ఓవర్లలో ఆటో ముగిసే సమయానికి 286 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని వరుణ్ 79 పరుగులు చేశాడు. విశాఖపట్నం జట్టులోని దేవాశిష్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. యశ్వంత్ 2 వికెట్లు తీసుకున్నాడు.

సిరులు కురిపిస్తున్న బూడిద గుమ్మడి

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి - ప్రభుత్వం గిడ్డంగులు ఏర్పాటు చేస్తే పెరగనున్న సాగు విస్తీర్ణం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

బూడిద గుమ్మడికాయ రైతులకు ఆదాయాన్నిస్తోంది. ఇక్కడ పండించే పంటను తమిళనాడు, కేరళ, ఢిల్లీ రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. గిడ్డంగులు ఏర్పాటు చేస్తే బూడిద గుమ్మడి సాగు విస్తీర్ణం పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. పంట సాగు చేయడానికి ఖర్చుతోపాటు నీరు కూడా తక్కువ అవసరం కావడంతో రైతులు బూడిదగుమ్మడిసాగుపై మొగ్గు చూపుతున్నారు. తమిళనాడు రాష్ట్రంలో అత్యధికంగా ఈ పంటను పండిస్తారు. మన రాష్ట్రంలో కూడా ఈ పంటను పండించడానికి రైతులు ముందుకు వస్తున్నారు. తక్కువ ఖర్చుతో పంటలు సాగు చేయొచ్చు.. అధిక లాభాలు పొందవచ్చునని రైతులు పేర్కొంటున్నారు. గిడ్డంగులు ఏర్పాటు చేసి బూడిద గుమ్మకాయ నుంచి విత్తనాలు తయారు చేసే యంత్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే విస్తీర్ణ శాతం పెరుగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. బూడిద గుమ్మడి కాయలో, విత్తనాల్లో, తీగలో కూడా ఔషధ గుణాలున్నాయని పలువురు పేర్కొంటున్నారు. కడుపులో మంట, ఉబ్బరం తగ్గించేందుకు, దాహం ఎక్కువగా ఉన్నప్పుడు బూడిద గుమ్మడి చక్కటి ఔషధంలా పనిచేస్తుంది. అలాగే మలబద్ధకంతో బాధపడే వారు రోజూ బూడిద గుమ్మడికాయను ఆహారంలో భాగంగా తీసుకుంటుంటే సమస్య పరిష్కారమవుతుంది. ఈ విత్తనాల నుంచి తీసిన నూనె చర్మవ్యాధుల నివారణకు వాడుతుంటారు. ఇంకా బూడిదగుమ్మడి తీగ రసాన్ని హై బిపి, నిద్రలేమితో బాధపడేవారికి ఇస్తే మంచి ఫలితం ఉంటుందని ఆయుర్వేదం చెబుతోంది. నీరు అధికంగా ఉండే బూడిదగుమ్మడిలో కార్బోహైడ్రేట్లు, కొవ్వు అతి తక్కువ శాతం ఉండడంతో డైటింగ్ చేసే వారు ఎక్కువగా వాడుతున్నారు. దీంతో బూడిదగుమ్మడికి మంచి గిరాకీ ఉంటుందని రైతులంటున్నారు.

సాగుకు వేడి వాతావరణం అనుకూలం..

బూడిదగుమ్మడి సాగుకు వేడి వాతావరణం అనుకూలిస్తుంది. 20 రోజులకు ఒకసారి తడి అందించినా సరిపోతుంది. తేలికపాటి బంకమట్టి నేలలు ఎంతో అనుకూలం. ఇది తీగ పంట కావడంతో నీటి సౌకర్యం తక్కువగా ఉన్న రైతులు డ్రిప్ ఆధారంగా పంట సాగు చేసుకోవచ్చు. విత్తనాలను రెండు సెంటిమీటర్ల లోతులో నాటాలి. విత్తే ముందు ఎకరాకు ఆరు నుంచి ఎనిమిది టన్నుల పశువుల ఎరువు, ఓ బస్తా భాస్వరం, 20 కిలోల పొటాషియంను ఎరువులుగా వేసుకోవాలి. నత్రజని సమపాళ్లలో వేసి పూత, పిందె దశలో వేయాలి.

- ఆర్.రాజశేఖర్‌రెడ్డి, రైతు, లింగాల

బూడిద గుమ్మడి కాయలను అమ్మకానికి వాహనంలో తరలిస్తున్న రైతులు (ఇన్‌సెట్) బూడిద గుమ్మడి పంట

పెట్టుబడి రూ.20 వేలు.. ఆదాయం రూ.లక్ష..

తమిళనాడు నుంచి బూడిద గుమ్మడి విత్తనాలు తెప్పించా. మామిడి తోటలో పాదులు తీయించి డ్రిప్ ద్వారా పంట సాగు చేశా. ఎకరా భూమికి విత్తనాల కోసం రూ.3,500 ఖర్చయింది. ఇతరత్రా ఖర్చులు కలుపుకొని మొత్తం పెట్టుబడి ఎకరాకు రూ.20వేలు అయింది. కేరళ, తమిళనాడు, స్థానిక వ్యాపారులు బూడిద గుమ్మడిని కొనుగోలు చేశారు. ఎకరా పంటకు రూ.1.50 లక్షలు రాబడి రాగా ఖర్చులు పోను రూ.1.30 లక్షలు మిగిలింది. బోరులో వచ్చే నీరు తక్కువగా ఉండడంతో వేరే పంటకైతే అర ఎకరా సాగుచేసే నీటితోనే నాలుగెకరాలు బూడిద గుమ్మడిని సాగు చేశా. నీటి సౌకర్యం తక్కువగా ఉన్న రైతులకు ఈ పంట ఎంతో మేలు. మార్కెట్లో ధరలు కూడా ఆశాజనకంగానే ఉన్నాయి.

-పెద్దమల్లు మదన్‌మోహన్‌రెడ్డి, రైతు, లింగాల

బూడిద గుమ్మడిలో సస్యరక్షణ..

బూడిద గుమ్మడిలో కలుపు నివారణకు మెటలాక్లోర్ మందును పిచికారీ చేయాలి. మొక్కలు రెండు నుంచి నాలుగు ఆకుల దశలో ఉన్నప్పుడు లీటర్ నీటికి మూడు గ్రాముల బోరాక్స్ కలిపి పిచికారీ చేస్తే ఆడపూలు ఎక్కువగా పూసి పంట దిగుబడి పెరుగుతుంది. ఎక్కువగా గుమ్మడి పెంకుపురుగు, పండు ఈగతో నష్టం. గుమ్మడి పెంకు పురుగు నివారణకు కార్బరిల్ 50 శాతం పొడిని మూడు గ్రాములు లీటర్ నీటికి కలిపి చల్లుకోవచ్చు. పండు ఈగ నివారణకు పది మిల్లీల మలాథియాన్ 100 గ్రాముల చక్కెర లేదా బెల్లం పాకం నీటితో కలిపి తోటలో అక్కడక్కడ మట్టి ప్రమిదలో పోసి పెట్టాలి. ఇక బూజు, బూడిద, వేరుకుళ్లు తెగుళ్లు తదితరాలకు మాంకోజెబ్ లేదా డైనోకాప్ మందులు పిచికారీ చేయవచ్చు.

- ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి, పులివెందుల

మంత్రులతో మాట్లాడుతున్న బీటెక్ రవి, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే మాధవిరెడ్డి

పులివెందుల నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల నియోజకవర్గం అభివృద్ధే తమ లక్ష్యమని టిడిపి నియోజవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. బుధవారం ఆయన రాష్ట్ర వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల, మార్కెటింగ్, సహకార, మత్స్యకారు శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, బిసి సాంఘిక సంక్షేమ, చేనేత అండ్ జౌళి శాఖ మంత్రి సబితాను విజయవాడలో కలిశారు. కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, టిడిపి నాయకులు శ్రీనివాసులరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కలిసినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు జిల్లాలోని పలు సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా నియోజకవర్గంలో పాడి పరిశ్రమలను అభివృద్ధి చేసి రైతులను ఆర్థికంగా అభ్యున్నతి సాధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సహకార శాఖ పరిధిలో రైతులకు విరివిగా పంట రుణాలను అందించాలని కోరారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని మంత్రులు హామీ ఇచ్చారని బీటెక్ రవి తెలిపారు.

గోరంత ఇచ్చి గొప్పలు చెప్పకోవడం శోచనీయం

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి గోరంత ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం శోచనీయమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కొందరు టిడిపి, బిజెపి నాయకులు చంకలు గుద్దుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అమరావతికి ఇవ్వబోయేది గ్రాంట్ కాదని, ప్రపంచ బ్యాంకు అప్పు అని కేంద్ర ఆర్థిక మంత్రి, ముఖ్యమంత్రి స్పష్టంగా చెబుతున్నా.. కొందరు రాష్ట్ర నాయకులు గ్రాంట్ అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రత్యేకహోదా ప్రస్తావన లేనందుకా, కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ప్రస్తావన లేనందుకా, దుగ్గరాజపట్నం ఓడ రేవు ప్రస్తావన లేనందుకా, విశాఖ మెట్రో, విజయవాడ మెట్రో, విశాఖ రైల్వేజోన్, కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ప్రస్తావన లేనందుకా అని ఆయన ప్రశ్నించారు. పోలవరం, రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద నిధులు మంజూరు చేయనందుకా చంకలు గుద్దుకోవడం అని ఎద్దేవా చేశారు. లేకపోతే ఎయిమ్స్‌తోపాటు సంస్థలకు నిధులు కేటాయించనందుకా అన్నారు. రూ.25 వేల కోట్ల ఎరువుల సబ్సిడీ తగ్గించి రైతుల కడుపు కొట్టినందుకా అన్నారు. రూ.7082 కోట్ల ఆహార సబ్సిడీ తగ్గించి పేదల కడుపు కొట్టారన్నారు. రూ.315 కోట్ల గ్యాస్, పెట్రోల్, డీజల్ సబ్సిడీ తగ్గించి వాటి ధరలు పెంచుతున్నందుకా అన్నారు. ఎపికి రావాల్సిన వాటిపై పోరాటం చేయాలని టిడిపి, బిజెపి నాయకులకు కాంగ్రెస్ పార్టీ సూచిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నిస్వార్థపరుడు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

- జమ్మలమడుగు జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర భవిష్యత్‌కు జీవం పోసే ప్యాకేజీ స్టార్ జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అని జమ్మలమడుగు జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున అన్నారు. బుధవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో పాటు అతని అనుచర వర్గం పవన్‌కల్యాణ్‌ను ప్యాకేజీ స్టార్ అని అంటూ వచ్చారన్నారు. వారన్నట్లు స్వలాభాల కోసం ప్యాకేజీ తీసుకొనే స్టార్ మా అధినేత కాదని ఉద్ఘాటించారు. కూటమి ఏర్పడడానికి మూల కారకుడు పవన్‌కల్యాణ్ అన్నారు. తప్పు చేస్తే తనపై కూడా చర్యలు తీసుకోవాలని శాసనసభలోనే చెప్పిన ఏకైక నిబద్ధత గల నేత పవన్‌కల్యాణ్ అన్నారు.

మురుగు కాలువల్లో పూడికతీత

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని మురుగు కాలువల్లో పూడికతీత పనులను చేపట్టారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గండి రోడ్డులో పూడిక తీశారు. వర్షాలు కురిసినప్పుడల్లా గండి రోడ్డులో నీరు రోడ్లపై వచ్చి చేరుతోంది. దీంతో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందిగా మారుతుంది. కాలువ లోని మట్టిని తొలగించడంతో ఆప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలను ఇఒ దగ్గర ఉండి పారిశుధ్య సిబ్బందితో పనులు చేయించారు.

గండి రోడ్డులో చేపట్టిన పూడికతీత పనులు

ఎంఇఒపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ఎంఇఒ సావిత్రమ్మపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్ రాజ్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల (హోమస్‌పేట)లో దాదాపుగా 250 మంది విద్యార్థులున్నారని.. డిఇఒ ఆదేశాల మేరకు ఇక్కడ పనిచేస్తున్న టీచరను సర్‌ప్లస్ పేరుతో పులివెందులకు బదిలీ చేశాంన్నారు. దీంతో ఆ పాంశాలలో టీచర్ కొరత ఏర్పడిందని తెలిపారు. ఆ టీచర్‌ను బదిలీ చేసి నెల రోజులు అవుతున్నా.. ఇంతవరకు పాఠశాలలో మరో టీచర్‌ను నియమించలేదన్నారు. విద్యార్థులు చదువులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఇఒ సావిత్రమ్మ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. డిఇఒ ఆదేశాలకు మేరకు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల నుంచి టీచర్‌ను బదిలీ చేస్తే అక్కడ టీచర్ల కొరత ఏర్పడుతుందని తెలిసి, ఉన్నతాధికారులకు చెప్పలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలపై మొండిగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకొనకపోవడం దారుణమన్నారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పాఠశాలలోనే అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో టీచర్‌ను ఏర్పాటు చేసి, ఎంఇఒ సావిత్రమ్మపై విచారించి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఓబులేసు, అభిలాష, ఆర్యన్, మోహన్, శ్రీహరి పాల్గొన్నారు.

పరిష్కార వేదిక సమస్యను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని విజయనగరం గ్రామానికి చెందిన ముక్కమల్ల జెర్మియా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల ప్రజా వేదికలో భూ సమస్యపై ఫిర్యాదు చేశారు. దీనిపై జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు బుధ వారం విచారించారు. అల్లాడుపల్లె గ్రామ సర్వే నెంబర్ 214 -బీలో జర్మియా పేరున 12 సెంట్లు అగ్రిమెంటు ఉంది. ఈ స్థలం ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఆర్‌డిఒ రికార్డులు, స్థలం పరిశీలించారు. స్థలానికి ఇరువైపులా ఉన్న రైతులతో మాట్లాడారు. ఈ స్థలంలో అంగన్వాడీ బిల్డింగ్ నిర్మాణం జరిగినట్లు గుర్తించారు. అగ్రిమెంటులో ఉన్న వివరాలకు స్థలం వివరాలకు తేడా ఉన్నట్లు గుర్తించారు. అలాగే రేషన్ బియ్యం పంపిణీ చేసే ఆటో ఇతరులకు అందించారని జెర్మియా పేర్కొనగా గ్రామస్తులతో అర్జీ ఇప్పిస్తే ఆటో తిరిగి ఇస్తామని హామీ ఇచ్చారు. తహశీల్దార్ జి. ఉమారాణి, రీ సర్వే డిటి ప్రవీణ్, సర్వేయర్ సాయిలత, విఆర్‌ఒ ప్రణయ్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ముద్దనూరు

వివిధ వ్యాధుల బారిన పడిన పశువులకు వైద్యం చేసినట్లు పశు వైద్యాధికారులు వాసా శ్రీనివాస, హిమబిందు తెలిపారు. పశు సంవర్ధక శాఖ రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా కొత్త చౌటిపల్లె గ్రామంలో బుధవారం పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం వద్ద పశువులకు ఫర్టిలిటీ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆవులు, గేదెలకు గర్భకోశ వ్యాధులకు వైద్యం చేశామన్నారు. ఎదకు రాని పశువులకు ఎముకల పొడి, మాత్రలు, మందులు వేశామన్నారు. కొత్తగా నియమించిన అనిమల్ హస్బెండ్రి అసిస్టెంట్లకు కృత్రిమగర్భధారణ చేయడంలో శిక్షణనిచ్చామన్నారు. డిఎల్‌డిఎ డాక్టర్ శివరామిరెడ్డి వివిధ గర్భకోశ వ్యాధులకు వైద్యం చేశారు. పశు వైద్యాధికారి శకుంతలమ్మ, సిబ్బంది శశిరేఖ, శివలింగేశ్వర్‌రెడ్డి, వీరేంద్ర, పార్థసారథి, శిక్షణ పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - వేంపల్లె

స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకులు ఇచ్చే రుణా సహాయంతో జీవనోపాధులు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని డిఆర్‌డిఎ పిడి ఆనంద్ నాయక్, ఎంపిడిఒ సంపతి దివిజా సూచించారు. బుధవారం స్థానిక వైఎస్ఆర్ సభా భవనంలో మండల సమాఖ్య 14వ వార్షికోత్సవం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగాలనేదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక విషయాలతోపాటు ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని కోరారు. అందరూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. మహిళా చట్టాలపై మంచి అవగాహన ఉండాలని కోరారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ వెంకటరమణ, డిసిసి బ్యాంకు మేనేజర్ బాలాజీరావు మాట్లాడుతూ బ్యాంకు రుణాలను మహిళా సంఘాలు సకాలంలో చెల్లించాలని కోరారు. రుణాల సంఖ్యను పెంచేందుకు అర్హత ఉన్న పొదుపు సంఘానికి రూ.20 లక్షల వరకు రుణం ఇస్తామన్నారు. నూతన మండల సమాఖ్య కమిటీ ఎన్నిక జరిగింది. మహిళా సమాఖ్య అధ్యక్షురాలుగా సునంద, కార్యదర్శిగా గౌతమి, కోశాధికారిగా నాగేశ్వరి, ఉపాధ్యక్షురాలిగా సుబ్బరత్నమ్మ, ఉప కార్యదర్శిగా గౌసున్ ఎన్నికయ్యారు. ఏరియా కో-ఆర్డినేటర్ నీలకంఠారెడ్డి, ఎపిఎం బాలస్వామి, ఎపిజిపి ఫీల్డ్ ఆఫీసర్ ఉత్తమారెడ్డి, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆర్‌జెయుకెటి వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్ సూచించారు. ఆర్‌జెయుకెటి పరిధిలోని ఒంగోలు ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌కు చెందిన అడ్మిషన్ల ప్రక్రియను బుధవారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలోని సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు ట్రిపుల్‌ఐటికి ఎంపికైన మొదటి నలుగురు విద్యార్థులకు మొదటి అడ్మిషన్లను వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్, అడ్మిషన్ల కన్వీనర్ అమరేంద్ర సంద్రా అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు డైరెక్టర్ భాస్కర్ పటేల్, ఇడుపులపాయ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, అడ్మిషన్ల కన్వీనర్ అమరేంద్ర, ఆర్కే వ్యాలీ పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, ఇమ్రాన్, రత్నకుమారి, ఒంగోలు క్యాంపస్ డీన్ రూపేష్, అసోసియేషన్ డీన్ చంద్రారెడ్డి, రోజర్ బిన్ని, రాఘవరెడ్డి, పిఆర్‌ఒ తిరుపతిరెడ్డి, క్యాంపస్ మెయిన్ టెన్స్ ఆఫీసర్ అనిల్‌కుమార్‌రెడ్డి, సెక్యూరిటీ ఇన్‌ఛార్జి శరవన్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

పిఒపి వినాయక విగ్రహాల అమ్మకాలు నిషేధం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాల అమ్మకాలను నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ పులివెందుల పట్టణ పరిధిలో విగ్రహాల తయారీ, అమ్మకపు యజమానులకు పలు సూచనలు చేశారు. పర్యావరణానికి అనుకూలమైన పదార్థాలు, మట్టితో తయారు చేసిన విగ్రహాలను మాత్రమే అమ్మాలని సూచించారు. తమ ఇంటిలో ఏర్పాటు చేసుకున్న ప్రతిమను ఇంటి వద్దనే తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న నీటి తొట్టిలోనే వినాయక నిమజ్జనం చేయాలని, ఆ నీటిని చెట్లు, పూల, పండ్ల మొక్కలకు వాడాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వి.వరప్రసాద్ ప్రజలకు సూచించారు. మెప్మా ఆర్పీలు, సచివాలయ సిబ్బంది, వ్యాపారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలని బాధితులు నిరసన

ప్రజాశక్తి - మైదుకూరు

బళ్లారి-కృష్ణపట్నం నేషనల్ హైవే పనుల కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం అందకపోవడంతో బాధిత రైతు కుటుంబాల సభ్యులతో కలిసి ప్రొద్దుటూరు రోడ్డులో జరుగుతున్న హైవే పనులను బుధవారం రాష్ట్ర రైతు సంఘం నాయకులు అడ్డుకున్నారు. నేషనల్ హైవే కాంట్రాక్ట్ ప్రతినిధులు పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో.. మైదుకూరు అర్బన్ సీఐ మస్తాన్, అర్బన్ ఎస్ఐ గణ మద్దిలేటి సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులతో పోలీసులు చర్చించారు. విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.

అభిషేక్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

తల్లిదండ్రుల ఆలోచనలకు తగ్గట్లు మెలగాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థినులు తల్లిదండ్రుల ఆలోచనలకు తగ్గట్లు మెలగాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సింగంశెట్టి అభిషేక్ సూచించారు. ప్రొద్దుటూరు పరిధిలోని పెద్దశెట్టిపల్లె గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మొదటి సంవత్సర విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపల్ రామసుబ్బమ్మ అధ్యక్షతన ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ విద్యార్థినులు మనో ధైర్యం కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో కాలం విలువను తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని నిర్దేశించారు. జీవితంలో ప్రతి ఒక్కరికి ఫెయిల్యూర్ అనేది ఉం టుందని, దాన్ని అధిగమించడానికి మార్గాలను ఉపదేశించారు. జీవితంలో తల్లిదండ్రుల పాత్ర గణనీయమన్నారు. యాక్టివిటీస్ ద్వారా మనోవికాసాన్ని పెంపొందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూరు, రవీంద్రారెడ్డి, కో-డైరెక్టర్ శైలూష, ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు, వివిధ విభాగ అధిపతులు బాలసుబ్బన్న, మహమ్మద్ జాబీర్, యాకూబ్ అలీ, విజయమ్మ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం ఎఒగా అల్తాఫ్ హుస్సేన్

ప్రజాశక్తి - ముద్దనూరు

ఎంపిడిఒ కార్యాలయ పరిపాలన అధికారిగా బుధవారం ఎస్.అల్తాఫ్ హుస్సేన్ బాధ్యతలు చేపట్టారు. ఆయన పెండ్లిమర్రి మండలం నుంచి డిప్యుటేషన్‌పై ఇక్క డికి వచ్చారు. అనం తరం ఆయన మాట్లాడుతూ మండ లాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. సచివాలయం ఉద్యోగులు ఆయా గ్రామ పంచాయతీల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోరు మామిళ్ల మండలం పారంపల్లె గ్రామానికి చెందిన కోరిమెల్ల బాబుకు తీవ్ర గాయాల య్యాయి. సిఐ రామాంజులు తెలిపిన వివరాల మేరకు.. బొలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది.

అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలతో మాట్లాడుతున్న డిఇఒ అనూరాధ

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించరాదు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్నం అందిస్తున్న భోజనం నాణ్యతగా ఉండాలని, శుభ్రత లోపిస్తే చర్యలు తప్పవని డిఇఒ అనూరాధ ఆదేశిం చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఖాజీపేట మెయిన్ స్కూల్, అంగన్వాడీ కేంద్రం పాఠశాలలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఇఒ మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల నైపుణ్యతను తెలుసుకున్నారు. తాగునీరు మరుగుదొడ్లు పరిశీలించి, తగు సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేకదృష్టి సారించి ఉత్తమ ఫలితాల సాధనకు పాటుపడాలన్నారు. అంగన్వాడీ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యులతో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - మైదుకూరు

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా సూచించారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వైద్యులకు డయేరియా నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇ కిరీటి, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్నియాలను వైద్య సిబ్బందికి అందిస్తున్న కుటుంబ సభ్యులు

నేత్రదానంతో అంధులకు కంటిచూపు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నేత్రదానం చేయడం వల్ల ఇద్దరు అంధులకు కంటిచూపు అందుతుందని స్నేహిత అమృత హస్త సేవా సమితి అధ్యక్షుడు ముమ్మెల రాజు తెలిపారు. పట్టణంలోని అమ్మవారిశాల వీధి పబ్బతి రాధాకృష్ణమూర్తి మంగళవారం రాత్రి మరణించారు. ఆయన సతీమణి కృష్ణవేణమ్మ, కుమారులు లోకేశ్వర్‌నాథ్, దక్షిణామూర్తి, కుమార్తె నిర్మల, కోడలు హరితలక్ష్మి, లక్ష్మీ ప్రసన్న, అల్లుడు రాజేంద్రప్రసాద్ నేత్ర దానానికి అంగీకరిస్తూ నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారమిచ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి రాజు రాధాకృష్ణమూర్తి పార్థివదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. నేత్రదానం చేయదలచినవారు 99665 09364, 70932 04537నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో ఏకాగ్రత మెరుగవుతుంది

ప్రజాశక్తి - చాపాడు

గ్రామీణ క్రీడలతో ఉల్లాసంతోపాటు శారీరక దృఢత్వం కలుగుతుందని ఎంఇఒలు రవిశంకర్, వంశీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం క్రీడా దినోత్సవంలో భాగంగా శిక్షా సప్తాహ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూరిబా బాలికల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడలైన కబడ్డీ, కోకో, ఉప్పాట, బొంగరాలు, గోలీల ఆటలు విద్యార్థులు మరిచిపోకుండా పాఠశాలల్లో ఆడిపిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి ఆటలతో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఏకాగ్రత మెరుగుపడుతుందని, శారీరకంగా విద్యార్థులు బలపడతారని తెలిపారు. తద్వారా చదువులో రాణిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఎంఇఒలు విద్యార్థులతో కలిసి కాసేపు ఆటలాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, పిజికల్ డైరెక్టర్ హాసిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే సిఎం చంద్రబాబు ధ్యేయం

- జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే సిఎం చంద్రబాబు ధ్యేయమని టిడిపి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అక్కులగారి విజయ కుమార్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి అజ్జుగుట్టు రవి తేజరెడ్డి అన్నారు. స్థానికంగా బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థి, యువత సంక్షేమ దిశగా ప్రభు త్వం అడుగులు వేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు కేటాయించినందుకు హర్షం వ్యక్తం చేశారు. వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సాధించిన విజయమన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంట్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : KADAPA

O.S.No. 217/2022

Palampalli Ayyavaru Reddy. **...Plaintiff**

Vs

1. Smt. P.J.S.Manjula, W/o M.Maria Kumar.
2. Smt. M.Divyakala, D/o M.Maria Kumar.
3. M.Santhosh, S/o M.Maria Kumar.

All are residing at D.No.36/323-29 Padmavathi Nagar, Opp. Reddy Colony, Bypass Road, Kadapa City, Kadapa YSR District.

...Defendant No. 1to 3

SUMMONS TO THE DEFENDANTS NO 1 TO 3

That the above suit is filed by the plaintiff for recovery of promissory note amount and the matter is posted to 24.07.2024 for year appearance. Please take notice and appear on 23.08.2024 at 10.30 A.M. in the above Court either in person or through an advocate failing which the matter will be decided exparty.

//By Order of the Hon'ble Court//

U. SESHAIAH, B.Com., B.L.
Advocate for Plaintiff,
KADAPA.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 99/2023

బండి ఆత్మకూరు రామిరెడ్డి, S/o రామిరెడ్డి, వయస్సు 54 సం॥రాలు, హిందు, వ్యవసాయం, సాకిన్, వార్డు నెం.1, బొల్లవరం, ప్రొద్దుటూరు. **...వాది**

Vs

దొండపాటి చెంద్రాయుడు, S/o పెద్దదుగ్గన్న, వయస్సు 58 సంవత్సరాలు, హిందూ, వ్యాపారం, సాకిన్, డోర్‌నెం.8/27, పెద్దపసుపుల గ్రామం, పెద్దముడియం మండలం. **...ప్రతివాది**

దావా సమను

పై నెంబరు దావా వాది, ప్రతివాది అయిన నీ పైన ప్రామీసరినోటు బాకీ నిమిత్తం దావా దాఖలు చేసివున్నాడు. అట్టి దావాలో నీవు ప్రతివాదిగా వుంటువున్నావు. అట్టి దావాలో ఎన్నిమార్లు సమన్లు పంపించినా మీరు తీసుకొనందున రాజశ్రీ కోర్టు వారు నీ పైన, పబ్లికేషన్ వేయుటకు ఉత్తర్వు చేసివున్నారు. అట్టి ఉత్తర్వు మేరకు 27/9/2024వతేదీన ఉ॥ 10.30ని॥లకు రాజశ్రీ కోర్టు నందు హాజరు అయ్యి నీవుగాని, నీ వకీలు ద్వారా గాని హాజరు అయి నీకు ఆక్షేపణలు వున్నయెడల తెలుపుకొవలెయును. లేనంతట నీ పరోక్షముగా ఎక్స్‌పార్టీగా తీర్మానింపబడును.

వాయిదా తేది : 27/09/2024

P.S.RANGA REDDY
Advocate for Plaintiff,
PRODDATUR